సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం : 27 : జులై : 2023



బస్సులో రూ.28లక్షలు చోరీ

జాతీయ రహదారిపై నిలిపిన ఓ ప్రైవేట్ బస్సులో నుంచి దుండగులు రూ.28లక్షలు చోరీ చేశారు.

- 8లో



ఆశ చూపారు.. నిండా ముంచారు

పెట్టుబడులు పెడితే డబ్బులు రెట్టింపు అవుతాయని ఫిలిప్స్ యాప్ పేరిట ఆశచూపి చివరకు బోర్డు తిప్పేశారు.

- 8లో

గరిష్టం/కనిష్టం 27°/24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

బోధనేతర సిబ్బంది భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనేతన సిబ్బంది పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి, బొమ్మలరామారం, పోచంపల్లి కేజీబీవీలో సహాయ వంట మనిషి, నారాయణపురం కేజీబీవీలో స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సహాయ వంట మనిషికి 7వ తరగతితో పాటు వంట చేయడంలో అనుభవం, స్వీపర్ పోస్టుకు 10వ తరగతి అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీలోపు సంబంధిత కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

శంకరమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



శంకరమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

మోత్కూరు: తెలంగాణ మలిదశ తొలి అమరుడు మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు శ్రీకాంత్‌చారి తల్లి శంకరమ్మ బుధవారం సూర్యాపేటలోని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శంకరమ్మ తన జన్మదినం సందర్భంగా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి ఆమెకు స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: 2023- 24 విద్యాసంవత్సరానికిగాను ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 5 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు (ఫ్రెష్, రెన్యువల్) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న 2022-23 ప్రీ మెట్రిక్ హార్డ్ కాపీలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ www.telanganaepass.cgg.gov.in ను సంప్రదించాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తుల స్వీకరణ

భువనగిరిటౌన్: జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు 2023- 24 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లిష్ మీడియం 1వ తరగతి (డేస్కాలర్), 5 తరగతి రెసిడెన్షియల్ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతి 23 సీట్లు, 5వ తరగతి వారికి 26 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 31 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు ఒకటవ తేదీ సాయంత్రం 5 గంటలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఒకటవ తరగతి వారు దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 1 , 2017 నుంచి మే 31 2018 వరకు జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

తెరిపివ్వని వాన



భూదాన్‌పోచంపల్లి: పెద్దరావులపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

- పొంగి పొర్లుతున్న మూసీ, దాటనివ్వని బిక్కేరు వాగు
- స్తంభించిన జనజీవనం
- జిల్లావ్యాప్తంగా 22.1మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- అత్యధికంగా మోత్కూరులో 45.8 మి.మీ., అత్యల్పంగా భువనగిరిలో 12.4 మి.మీ.

సాక్షి, యాదాద్రి: జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. చెరువులు, కుంటలు నిండి వాగులు, వంకలు పారుతున్నాయి. హైదరాబాద్‌లో పలు చోట్ల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని మూసీ నదీ ప్రవాహం ప్రమాదకరస్థాయికి చేరింది. బిక్కేరు, చిన్నేరు వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురవనుండడంతో వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. దీంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. బుధవారం జిల్లావ్యాప్తంగా 22.1మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా.. మోత్కూరులో అత్యధికంగా 45.8 మి.మీ, భువనగిరిలో 12.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

జూలూరు- రుద్రవెల్లి మధ్యనున్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద

జూలూరు- రుద్రవెల్లి గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవహిస్తుండడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోచంపల్లి మండల ప్రజలు బీబీనగర్, భువనగిరికి వెళ్లడానికి ఇదే ప్రధానమార్గం. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మూసీ ఉధృతి కొనసాగుతుండటంతో ఈ మార్గంలో తరుచుగా బీబీనగర్‌కు రాకపోకలు బంద్ అయి ఉద్యోగులు, స్కూల్, కాలేజీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా సకాలంలో భూసేకరణ చేయకపోవడం, బాధిత రైతులకు పరిహారం చెల్లించని కారణంగా జూలూరు గ్రామానికి చెందిన రైతులు కోర్టుకు వెళ్లడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మోటకొండూర్ మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. మండల కేంద్రంలో బిక్కేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కాటేపల్లి – మోటకొండూర్ పెద్ద వాగు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు కొంత ఇబ్బందిగా మారింది. అమ్మనబోలు శివారులోని గొలనుకొండ వాగుపై నీరు వెళ్తుండడంతో ప్రయాణికులకు అంతరాయం కలిగింది. రాజాపేట మండలంలో మూడు నాలుగు రోజుల నుంచి వరుసగా ముసురు పడుతుండడంతో ఎనిమిది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. తుర్కపల్లి మండలంలో కురుస్తున్న వర్షంతో చిన్న లక్ష్మాపురంలోని సముద్రం చెరువు నిండి అలుగు పోస్తుంది. గంధమల్ల గ్రామంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఆలేరు పట్టణంలో భారీ వర్షం కారణంగా మార్కండేయ కాలనీ ప్రధాన రహదారిపై నీళ్లు చేరాయి. అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది జేసీబీ సాయంతో నీళ్లను తొలగించారు. ఆత్మకూరు (ఎం) మండలంలో వర్షంతో రోడ్లు చిత్తడిగా మారాయి. బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా ఇరువైపుల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించవద్దంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మొరిపిరాల, కొరటికల్, పోతిరెడ్డిపల్లి, బిక్కేరు వాగుల వద్ద అధికారులు కాపలాగా ఉంటున్నారు.

బుధవారం నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	మిల్లీమీటర్లు	మండలం	మిల్లీమీటర్లు
తుర్కపల్లి	12.8	పోచంపల్లి	10.8
రాజాపేట	27.2	నారాయణపురం	20.2
ఆలేరు	20.2	రామన్నపేట	18.6
మోటకొండూర్	18.0	వలిగొండ	26.2
యాదగిరిగుట్ట	19.8	ఆత్మకూర్	31.2
భువనగిరి	12.4	మోత్కూర్	45.8
బొమ్మలరామారం	13.6	అడ్డగూడూరు	27.8
బీబీనగర్	20.2	గుండాల	30.6

గ్రామాల్లో నిలిచిన రాకపోకలు

మూసీ పరీవాహక గ్రామాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వలిగొండ మండలం సంగం, భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు వద్ద మూసీ లోలెవల్ వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు పహారా కాస్తున్నారు. సంగం వద్ద నుంచి వెళ్లకుండా ప్రయాణికులను దారి మళ్లించారు. దీంతో చౌటుప్పల్ ప్రాంతం నుంచి వలిగొండ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.



భూదాన్‌పోచంపల్లి: అలుగు పోస్తున్న పోచంపల్లి చెరువు



ఆత్మకూరు(ఎం)లో బిక్కేరు వాగు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

దిద్దుబాటులో కాంగ్రెస్



ఆలేరులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్

- నియోజకవర్గాల్లో వరుసగా సమావేశాలు
- డీసీసీ పదవి రేసులోకి కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, యాదాద్రి : డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మూడు రోజుల క్రితం బీఆర్‌ఎస్‌లో చేరిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టింది. రెండు రోజులుగా నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది. అనిల్ కుమార్ రెడ్డి వెంట ఎవరూ వెళ్లకుండా.. వారికి భవిష్యత్తుపై భరోసా కల్పిస్తోంది. అయితే, తనపై అనిల్‌కుమార్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెర వెనుక ఉండి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. బీజేపీలో ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్‌లో ఉన్న చింతల వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమ అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి భవిషత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా తెరపైకి వచ్చారు. ఖాళీ అయిన డీసీసీ అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని బుధవారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని కలిశారు. కాంగ్రెస్‌లోనే ఉన్నప్పటికి ఆయన క్రియాశీలక రాజకీయాలకు ఇప్పటి వరకు దూరంగా ఉన్నారు.

అనుచరులతో చింతల సమావేశం

భువనగిరిలో తన ముఖ్య అనుచరులతో చింతల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. బీఆర్‌ఎస్ తనను సరిగా ఉపయోగించుకోలేదని, ఎనిమిది సంవత్సరాలుగా ఎదురుచూసినా ఫలితం లేదన్న అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తనకు కాంగ్రెస్ నుంచి ఆహ్వానం ఉందని, సోనియాతో మాట్లాడిన తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ తెచ్చుకుని పోటీలో ఉంటానని చెబుతున్నారు. కాగా, ఆయన కాంగ్రెస్‌లో ఉండగా భువనగిరి మాజీ ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో రాజకీయ విభేదాలు కొనసాగాయి. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో ఉండగా, కాంగ్రెస్‌లో ఉన్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో తనకు విభేదాలు లేవని వెంకటేశ్వర్‌రెడ్డి చెబుతున్నట్లు సమాచారం.

నియోజకవరాల వారీగా సమావేశాలు

భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహించింది. అనిల్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడినప్పటికి ఎలాంటి నష్టం లేదన్న సంకేతాలు క్యాడర్‌కు ఇస్తున్నారు. ఈ సమావేశాలకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. బుధవారం ఆలేరులో జరిగిన ఆలేరు నియోజకవర్గ సమావేశానికి సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ హాజరయ్యారు.

అనిల్‌కుమార్‌రెడ్డికి ఎంపీ టికెట్?

- సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ పార్టీలో చర్చ



అనిల్‌కుమార్‌రెడ్డికి విక్టరీ సింబల్ చూపుతున్న కేసీఆర్ (ఫైల్)

సాక్షి, యాదాద్రి : మూడు రోజుల క్రితం బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టికెట్ ఖరారు అయినట్లు సమాచారం. పార్టీలో చేరిక సందర్భంగా కేసీఆర్ ఎంపీ టికెట్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. భువనగిరి పార్లమెంట్ స్థానానికి 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున పోటీచేసిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పరాజయం పొందారు. అనంతరం బూర నర్సయ్య బీజేపీలో చేరారు. ఆయన రాజీనామాతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడానికి బలమైన అభ్యర్థి కోసం బీఆర్‌ఎస్ అధినేత అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన అనిల్‌కుమార్‌రెడ్డికి ఎంపీ టికెట్ హామీ లభించినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడానికి ముందు సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుతో భేటీ జరిగింది. ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తానని సీఎం హామీ ఇవ్వగా అనిల్‌కుమార్‌రెడ్డి సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో చేరిక సందర్భంగా జరిగిన సమావేశంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డిలు ఇద్దరూ భువనగిరిలో కలిసి పనిచేయాలని చెప్పిన విషయం వెనక అంతరార్థం ఇదేనని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి చేరికతో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి అసెంబ్లీ టికెట్ విషయంలో వస్తున్న ఊహాగానాలకు తెర పడినట్లయింది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



ఎల్‌ఓసీ అందజేస్తున్న గొంగిడి సునీత

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన సౌకర్యాలతో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కోరారు. ఆలేరు నియోజకవర్గంలోని గుండాల, యాదగిరిగుట్ట, రాజాపేట మండలాలకు చెందిన ఐదుగురికి మంజూరైన రూ.11లక్షల ఎల్‌ఓసీ చెక్కులను బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలో 34 సబ్ సెంటర్ భవనాలకు (ఒక్కో భవనానికి రూ.20లక్షలు) నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత 5 నెలల క్రితం మహిళల కోసం గుండాల మండలం వెల్మజాలలో ఆరోగ్య మహిళా పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. ఇటీవల రాజాపేట మండలం సింగారంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ముగ్గురికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, వారికి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

లహరికి మెరుగైన వైద్యం..

యాదగిరిగుట్ట మండలం చిన్న గౌరాయపల్లికి చెందిన 11 సంవత్సరాల లహరికి నిమ్స్ ఆస్పత్రిలో గుండె మార్పిడి చికిత్స జరుగుతుందని, ఈ చికిత్స బాధ్యత తనదేనని విప్ సునీత తెలిపారు. చికిత్స నిమిత్తం లండన్‌కు చెందిన వైద్యులు నిమ్స్‌కు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గుండె మార్పిడికి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ అందించానని, పూర్తి వైద్యం కోసం తాను బాధ్యత తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్ తాళ్లపల్లి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, మండల, పట్టణ సెక్రటరీ జనరల్స్ శ్రీనివాస్‌గౌడ్, నరహరి, వెంకటయ్య, బీరయ్య, మహేష్, సంతోష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఎటువంటి సంఘటనలు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, రాజాపేట, మోత్కూర్, అడ్డగూడూరు, గుండాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 08685 – 293312 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి చెప్పారు. అత్యవసర సేవలకు ఈ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఓ నాగిరెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

భువనగిరి: ఉపాధి హామీలో అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ అనురాధ కోరారు. బుధవారం భువనగిరి పట్టణంలోని పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో యాత్ర సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఉపాధి కూలీలు, బీడీ కార్మికులు, గృహ కార్మికుల సామాజిక భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీలో 70 శాతం పనిదినాలు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. రైతుబీమా పథకానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పెరటి కోళ్ల పెంపకం, గడ్డి, చొప్ప, పశువుల, గొర్రెల కొట్టాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. యాత్ర సంస్థ డైరెక్టర్ శివలింగ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, శ్రీ లోగిల్లు సీఈఓ సురేష్‌రెడ్డి, సామాజిక ఉద్యమ నాయకుడు బట్టు రాంచంద్రయ్య, నాయకులు బాలనర్సయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీశైలం, మంజుల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆ బియ్యం.. ఏం చేద్దాం?

- ఎఫ్‌సీఐ తిరస్కరించిన ఫోర్టిఫైడ్ బియ్యంపై కానరాని స్పష్టత
- తిరిగి తీసుకోబోమంటున్న మిల్లర్లు
- రాష్ట్ర పూల్ కింద ప్రభుత్వమే తీసుకోవాలని కమిషనర్‌కు కలెక్టర్ లేఖ
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: యాదాద్రి, నల్లగొండ జిల్లాల్లో 17 మిల్లులు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు (ఎఫ్‌సీఐ) ఇచ్చిన దాదాపు 3 వేల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధక పదార్థాలు కలిపిన బియ్యం) విషయంలో ఏం చేయాలన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఆయా మిల్లర్లు ఇచ్చిన ఫోర్టిఫైడ్ బియ్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేవంటూ తిరస్కరించి, ఆ మిల్లులను బ్లాక్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. ఆయా మిల్లులు ఆ బియ్యాన్ని తీసుకొని నాణ్యత ప్రమాణాల మేరకు ఇచ్చే వరకు వాటి నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) తీసుకోబోమని స్పష్టం చేయడంతో మిల్లర్లు ఆందోళనలో పడ్డారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ఇటీవల పౌర సరఫరాల శాఖ ఎండీకి లేఖ రాశారు. మిల్లర్లు ఆ బియ్యాన్ని వెనక్కి తీసుకొని, మళ్లీ డెలివరీ చేయడం ఇబ్బందికరమని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ తీసుకోబోమని స్పష్టంగా చెప్పినందున ఆ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ స్టేట్ పూల్ (రాష్ట్ర కోటా) కింద తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. లేఖ రాసి పది రోజులు కావస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ చెప్పకపోవడంతో ఆయా మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ ఆగిపోయింది. రోజుకు 522 మెట్రిక్ టన్నుల బియ్యం డెలివరీ మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి నిలిచిపోయింది.

కుదరదంటున్న మిల్లర్లు

మిల్లర్లు ఫిబ్రవరి నెలలో ఎఫ్‌సీఐకి ఫోర్టిఫైడ్ బియ్యం అందజేశారు. నల్లగొండ జిల్లా పరిధిలోని 9 మిల్లులు 1566 మెట్రిక్ టన్నులు, యాదాద్రి జిల్లాలో 8 మిల్లుల నుంచి 1390 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు అందజేశారు. అప్పుడే ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐ అధికారులు తనిఖీ చేసుకొని ఓకే చెప్పారని మిల్లర్లు చెబుతున్నారు. ఆరు నెలల తరువాత ఇప్పుడు ఆ బియ్యం ప్రమాణాల ప్రకారం లేవని తిరస్కరించడం సరికాదని మిల్లర్లు పేర్కొంటున్నారు. ఆ బియ్యాన్ని వెనక్కి తీసుకొని మళ్లీ అంతే పరిమాణం ఇవ్వడం సాధ్యం కాదని, పైగా ఆర్థిక భారంతో కూడిందని చెబుతున్నారు. తాము వెనక్కి తీసుకోబోమని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కూడా ఆలోచనలో పడింది.

స్టేట్ పూల్ కింద తీసుకునేనా?

ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రమే బియ్యాన్ని తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించి వాటిని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి మిల్లర్లు అందజేస్తున్నారు. అయితే పేదలకు ఇచ్చే బియ్యానికి కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐ తిరస్కరించిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర పూల్ కింద తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాసిన లేఖలో కోరారు. జిల్లాలో ఇప్పటికి అలా తీసుకున్న దాఖలాలు లేవని పేర్కొంటూనే ఇతర జిల్లాల నుంచి రాష్ట్ర పూల్ కింద తీసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐ తిరస్కరించిన ఆయా మిల్లుల బియ్యాన్ని రాష్ట్రం తీసుకోవాలని కోరారు. అయితే ఈ సమస్య ఒక్క ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మిల్లుల నుంచి అలాంటి బియ్యాన్ని ఎఫ్‌సీఐ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మిల్లుల బియ్యాన్ని సేట్ పూల్ కింద తీసుకుంటే మిగితా మిల్లులవి కూడా తీసుకోవాల్సి వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. అందువల్లే నిర్ణయం దీనిపై తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఓ అధికారి పేర్కొన్నారు. రాష్ట్రం ఆ బియ్యాన్ని స్టేట్ పూల్ కింద తీసుకోకపోతే మిల్లర్లే భరించక తప్పదన్నారు.

బీజేపీ నుంచి 'జిట్టా' సస్పెన్షన్

- కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న బాలకృష్ణారెడ్డి
- కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం



జిట్టా బాలకృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని ఆ పార్టీ సస్పెండ్ చేసింది. బాలకృష్ణారెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని, వారం రోజుల్లోగా పార్టీ అధిష్టానానికి సంజాయిషీ ఇవ్వాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీలో చేరిన ఒకటిన్నర సంవత్సరంలోనే బాలకృష్ణారెడ్డి ఆ పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. యువ తెలంగాణ పార్టీ అధ్యక్షుని హోదాలో జిట్టా బాలకృష్ణారెడ్డి తన పార్టీని 2022 ఫిబ్రవరి 16న బీజేపీలో విలీనం చేశారు. అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ద్వారా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ చుగ్ సమక్షంలో ఢిల్లీలో ఆయన బీజేపీ గూటికి చేరారు. అయితే కొంత కాలంగా బీజేపీకి జిట్టా దూరంగా ఉంటున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా జరుగుతోంది.

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా..

జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమం కంటే ముందు నుంచే యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన జిట్టా బాలకష్ణారెడ్డి భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నారు. ఉద్యమంలో జిట్టా బాలకృష్ణారెడ్డి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. భువనగిరి కోటను విద్యుత్ దీపాలతో అలంకరించి, తెలంగాణ సంప్రదాయంలో వంటకాలు చేయించి పెద్ద ఎత్తున హోలీ పండుగ నిర్వహించి అప్పట్లో సంచలనం సృష్టించారు. అయితే, 2009లో టీఆర్‌ఎస్ పార్టీ మహా కూటమిలో చేరింది. ఆ ఎన్నికల్లో భువనగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలిమినేటి ఉమామాధవరెడ్డి టీడీపీ నుంచి మహాకూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. తనకు టికెట్ రాకపోవడంతో మనస్తాపం చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచారు. ఆయన మరోసారి 2014లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2018లో బీజేపీ బలపర్చిన అభ్యర్థిగా యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటమి తప్పలేదు. ఈ క్రమంలో బీజేపీలో తన యువ తెలంగాణ పార్టీని విలీనం చేయడం ద్వారా భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేయాలని భావించారు. ఆ క్రమంలోనే తన రాజకీయ గురువు బండారు దత్తాత్రేయతో, బండి సంజయ్‌తో ఉన్న సత్సంబంధాలతో జిట్టా బీజేపీలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీ సస్పెండ్ చేయడంతో కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలుస్తోంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలోని కప్రాయపల్లి సమీపంలో బ్రిడ్జి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా పర్వతగిరి మండలం రాయపర్తి గ్రామానికి చెందిన సురేష్ బైక్‌పై హైదరాబాద్‌కు వెళుతున్నాడు. కప్రాయపల్లి సమీపంలో ఎదురుగా గుర్తుతెలియని బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం


సైదులు (ఫైల్)

మద్దిరాల : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మద్దిరాల మండల పరిధిలోని చిన్న నెమిల గ్రామంలో చోటు చేసుకుంది. నెమిల గ్రామానికి చెందిన యాట సైదులు(40) మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో జరుగుతున్న గొడవలకు మనస్తాపానికి గురైన సైదులు మంగళవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానిక రైతులు అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సైదులు బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

అస్వస్థతకు గురైన మహిళ మృతి


యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టలోని ఓ లాడ్జిలో బస చేయడానికి వచ్చిన మహిళ అస్వస్థతకు గురై మృతిచెందింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం హన్మాపురానికి చెందిన నాగపురి సునిత(48) తన చెల్లి లక్ష్మి, మరో వ్యక్తి పొట్ట కృష్ణయ్యతో కలిసి ఈ నెల 23న యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణ ఫ్యామిలీ రూమ్స్‌లో దిగింది. ఆ రోజు నుంచి యాదగిరిగుట్టలోనే వారు ఉంటున్నారు. మంగళవారం ఉదయం 5గంటల సమయంలో సునిత వాంతులు చేసుకుంటూ తీవ్ర అస్వస్థతకు గురైంది.గమనించి చెల్లి లక్ష్మి పొట్ట కిష్టయ్య సాయంతో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సునిత మరణించిందని నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఐ వాహనానికి తప్పిన ప్రమాదం

భువనగిరి : భువనగిరి సీఐ వాహనానికి ప్రమాదం తప్పింది. ఈ సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. మధ్యాహ్న సమయంలో పట్టణంలోని టీచర్స్ కాలనీ నుంచి అండర్‌పాస్ ద్వారా సీఐ వాహనం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తోంది. ఈ సమయంలో భువనగిరి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్వల్పంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సీఐ సుధీర్ కృష్ణ, డ్రైవర్‌కు గాయాలు కాలేదు. కానీ భయాందోళనకు గురైన వాహన డ్రైవర్ సంజీవ స్పృహకోల్పోయాడు. వెంటనే డ్రైవర్‌ను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బస్సు వేగంతో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ఆశ చూపారు.. నిండా ముంచారు..!

- ఫిలిప్స్ యాప్ పేరిట టోకరా
- రోజుల వ్యవధిలో డబ్బులు రెట్టింపు అవుతున్నాయని రూ.3కోట్లకు పైగా పెట్టుబడులు
- ఐదు రోజులుగా పనిచేయని యాప్
- నిర్వాహకులు బోర్డు తిప్పేశారని పెట్టుబడిదారుల ఆందోళన
- లబోదిబోమంటున్న సుమారు 300 మంది బాధితులు



ఫిలిప్స్ యాప్ వర్క్ గ్రూప్

అర్వపల్లి: తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయనే అత్యాశకు పోయి రూ.కోట్లు పోగొట్టుకున్న ఉదంతమిది. తమ యాప్‌లో పెట్టుబడులు పెడితే రోజుల వ్యవధిలో డబ్బులు రెట్టింపు అవుతాయని ఆశచూపిన నిర్వాహకులు చివరకు బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో నాలుగు మాసాల క్రితం ఓ వ్యక్తి ఫిలిప్స్ యాప్‌లో పెట్టుబడులు పెడితే స్కీంను బట్టి డబ్బులు రోజుల వ్యవధిలో రెట్టింపు అవుతాయని ప్రచారం చేశాడు. దీంతో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి, వేల్పుచెర్ల, కాసర్లపహాడ్, రామన్నగూడెం, పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తితో పాటు వివిధ గ్రామాలకు చెందిన 300 మందికి పైగానే యాప్‌లో చేరారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఒక్కొక్కరు తమ పేరుతో రూ .500 నుంచి రూ.1.67 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. యాప్‌లో చేరిన వ్యక్తి మరికొందరిని ఇందులో చేర్చాలి. ఫలితంగా పెట్టిన పెట్టుబడితో పాటు తను చేర్చిన వ్యక్తుల ద్వారా మరికొంత కమీషన్ వస్తుంది. దీంతో ఆశకు పోయిన కొందరు పోటీపడి ఈ యాప్‌లో చేర్చారు. ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టిన వారికి మొదట్లో రెట్టింపు రాబడి వచ్చింది.

అప్పులు చేసి.. ఆభరణాలు తాకట్టుపెట్టి..

జాజిరెడ్డిగూడెం, శాలిగౌరారం మండలాలకు చెందిన 300 మందికి పైగానే సుమారు రూ.3కోట్లకు పైగానే ఫిలిప్స్ యాప్‌లో పెట్టుబడి పెట్టినట్లు అంచనా. అనేక మంది అప్పులు చేయడంతో పాటు, బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. యాప్‌లో చేరిన సభ్యుల సెల్‌ఫోన్ల నంబర్లతో ఫిలిప్స్ ప్రొడక్ట్స్ వారు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఈ ఫిలిప్స్ ప్రొడక్ట్స్‌కు చెందిన మేనేజర్ పేరుతో చలామణి అయ్యే ఓ మహిళ ఈ గ్రూప్ సభ్యులకు సూచనలు చేస్తూ మెసేజ్‌లు పెడుతుంటారు. ఇదిలా ఉంటే జాన్సన్–జాన్సన్ పేరుతో మరో యాప్‌ను కూడా ఏర్పాటు చేశారు. అందులో కూడా భారీగానే పెట్టుబడులు పెట్టారు. అయితే, ఈ యాప్ కేవలం ఒక్కరోజు మాత్రమే పనిచేసినట్లు చెబుతున్నారు. ఫిలిప్స్ పేరుతో ఏర్పాటైన యాప్ నుంచి విత్‌డ్రా కార్యకలాపాలు 5రోజులుగా నిలిచిపోయాయి. దీంతో నిర్వాహకులు నిండా ముంచేశారని బాధితులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, విద్యావంతులు, ఉద్యోగులు కూడా ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది.

రూ.1.70 లక్షలు పోగొట్టుకున్నా



ఈ యాప్‌లో మొదట పెట్టుబడి పెట్టినప్పుడు బాగానే వచ్చాయి. ఆ తర్వాత యాప్‌లోని సభ్యులు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టడం, తదితర కారణాలతో విత్‌డ్రాలు నిలిచిపోయాయి. ఐదు రోజులుగా విత్‌డ్రా కావడం లేదు. చివరకు ఈ యాప్ మోసమని తేలిపోయింది.

–నజీర్, కాసర్లపహాడ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలు, మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలపై ఎస్పీ, డీఎస్పీల సూచనల మేరకు ప్రతి రోజు ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కూడా విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. తాజాగా ఈ ప్రాంతంలో ఓ యాప్ ద్వారా మోసం జరిగిన విషయం మా దృష్టికి రాలేదు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దు.

– బి.అంజిరెడ్డి, ఎస్ఐ, అర్వపల్లి

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

- సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మోత్కూరు : షార్ట్ సర్క్యూట్‌తో ఓ దుకాణం దగ్ధమైంది. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఉన్న ఓ దుకాణంలో బుధవారం ఉదయం 11గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దుకాణ యజమాని సుగురు సురేష్ చెరువు కట్ట చౌరస్తా వద్ద లింగేశ్వర స్వామి స్టేషనరీ జనరల్ స్టోర్ దుకాణాన్ని కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు. సురేష్ రోజువారీగానే యథావిధిగా దుకాణం తెరిచి కూర్చున్నాడు. వెనకాల ఎలుకల సౌండ్ వస్తుందని, తను సీట్లో నుంచి లేచి చూసే సరికి పొగలు పొగలు వ్యాపిస్తూ మంటలు అంటుకోవడం గమనించాడు. దీంతో భయాందోళనలో రోడ్డు పైకి వచ్చాడు. మంటలు తీవ్ర స్థాయికి చేరడంతో సమాచారం అందుకున్న ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఫైర్ ఎస్ఐ సాయి దీపక్ సిబ్బందితో చేరుకొని సుమారు గంటపాటు దుకాణంలో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ దుకాణంలో ఫర్నిచర్, ఫ్రిజ్, ర్యాక్స్, పుస్తకాల సామగ్రి పూర్తిగా కాలిపోయి సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

టపాకాయలే ప్రమాదానికి కారణమా ?

స్టేషనరీ జనరల్ స్టోర్ దుకాణం దగ్ధానికి కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో పాటు మరో వైపు టపాకాయలు కారణమని సంఘటన బట్టి తెలుస్తోంది. దుకాణంలో మంటలు మండుతున్నంత సేపు టపటపా శబ్దాలు రావడంతో టపాకాయలు, కాకర్లు అంటుకొని పేలుతున్నాయని ప్రత్యక్ష సాక్షులు చర్చించుకుంటున్నారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా దుకాణ యజమాని టపాకాయలు, కాకర్స్ అమ్ముతారని, దుకాణంలో స్టాక్ ఉండటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి దుకాణం దగ్ధం కావడానికి కారణం అయ్యుండొచ్చని భావిస్తున్నారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నలుగురు నిందితుల రిమాండ్

నాగారం : హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కె.శివశంకర్ తెలిపారు. బుధవారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన బోయినపల్లి నవీన్, బోయినపల్లి నాగరాజు, వేల్పుల వెంకన్న, ఈమళ్ల యామండ్ల అక్షయ్‌లు ఈ నెల 13న అదే గ్రామానికి చెందిన కొమిరె అల్లయ్యపై దాడి చేసి కొట్టారు.తీవ్రంగా గాయపడిన అల్లయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 22న మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించారు. నలుగురిపై హత్య కేసు నమోదు చేసి తుంగతుర్తి కోర్టు జడ్జి ఎదుట హాజరు పర్చగా వారిని జ్యూడిషియల్ కస్టడీకి పంపించినట్లు తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు ఎస్ఐ ముత్తయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రైవేట్ బస్సులో రూ.28లక్షలు చోరీ

- అల్పాహారం కోసం హోటల్ వద్ద బస్సు నిలపగా డబ్బు ఎత్తుకెళ్లిన దుండగులు
- నార్కట్‌పల్లి శివారులో ఘటన



బస్సు వద్ద నిల్చున్న ప్రయాణికులు

నార్కట్‌పల్లి : జాతీయ రహదారిపై నిలిపిన ఓ ప్రైవేట్ బస్సులో నుంచి దుండగులు రూ.28లక్షలు చోరీ చేశారు. నార్కట్‌పల్లి శివారులో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని కృష్ణా కాలనీ చెందిన సుశాంత్‌కుమార్ పాండా అనే వ్యక్తి ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో భాగంగా సుశాంత్‌కుమార్ పాండా ఇటీవల ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ తనకు రావాల్సిన రూ.28 లక్షలను వసూలు చేసుకుని ప్రైవేట్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో బుధవారం ఉదయం 8గంటల సమయంలో ప్రయాణికులు అల్పాహారం చేసేందుకు గాను బస్సును డ్రైవర్ నార్కట్‌పల్లి శివారులోని పూజిత హోటల్ వద్ద నిలిపాడు. దీంతో తోటి ప్రయాణికులతో పాటు సుశాంత్‌కుమార్ పాండా కూడా బస్సు దిగి హోటల్‌లోని వాష్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చేలోపే తన సీట్లో డబ్బులు ఉన్న రెండు బ్యాగులు కనిపించ లేదు. దీంతో బాధితుడు బస్సు డ్రైవర్, హోటల్ యజమాని సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని హోటల్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పాండా వచ్చిన బస్సుతో పాటు మరో రెండు బస్సులు ఆ సమయంలో హోటల్ వద్దకు వచ్చాయి. పాండాతో పాటు ఆ బస్సులో ప్రయాణించిన వారంతా అక్కడే ఉన్నారు. వారిని పోలీసులు తనిఖీ చేశారు. అయితే, ఈ బస్సులోని వారు కాకుండా వేరే వ్యక్తి ఒకరు ఈ బస్సు నిలిచిన సమయంలో అందులోకి ఎక్కి.. దిగినట్లు సీసీ కెమెరాలలో రికార్డయింది. ఆ వ్యక్తి ఎవరనేది పోలీసులు ఆరాతీస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

గుండెపోటుతో కాదు.. గాయాల వల్లే..

- కొద్దిరోజుల క్రితం మృతిచెందిన లహరి
- గాయాలవల్లే చనిపోయినట్లు పోస్టుమార్టం రిపోర్టు
- లహరి భర్త వల్లభ్‌రెడ్డి అరెస్టు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌కు చెందిన వివాహిత లహరి మృతి వివాదాస్పదంగా మారింది. కొద్దిరోజుల క్రితం ఆమె గుండెపోటుతో మృతిచెందిందని లహరి తండ్రి జైపాల్‌రెడ్డికి సమాచారం అందింది. తాజాగా ఆమె గుండెపోటుతో కాదని.. తలపై, శరీరంపై గాయాలవ్వడం వల్లే మృతి చెందిందంటూ వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఈ వ్యవహారంలో మొదట నుంచి అనుమానంగా ఉన్న ఆమె భర్త వల్లభ్‌రెడ్డిని నారాయణగూడ పోలీసులు బుధవారం నల్లగొండలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హిమాయత్‌నగర్‌కు చెందిన జైపాల్‌రెడ్డి పెద్ద కుమార్తె లహరికి గత ఏడాది నల్లగొండ జిల్లాకు చెందిన వల్లభ్‌రెడ్డితో వివాహం జరిగింది. ఈ నెల 15వ తేదీన లహరి గుండెపోటుకు గురై మృతిచెందినట్లు తండ్రి జైపాల్‌రెడ్డికి సమాచారం అందింది. దీనిపై అదేరోజు తన కుమార్తె మరణంపై అనుమానం లేదంటూనే తన కుమార్తె మృతికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ జైపాల్‌రెడ్డి నారాయణగూడ పోలీసులకు రెండు విధాలుగా ఫిర్యాదు చేశాడు. దీనిపై 174 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లహరి తలకు బలమైన గాయాలయ్యాయని, అందువల్లే మృతిచెందిందని పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. దీంతో లహరి భర్త వల్లభ్‌రెడ్డిని పోలీసులు బుధవారం నల్లగొండలో అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు. అనంతరం రిమాండ్‌కు పంపినట్లు నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పోలీసుల అదుపులో లహరి మామ?

నిడమనూరు : నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన లహరి మామ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డిని బుధవారం తెల్లవారుజామున స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మంగళవారం తుమ్మడంలో లహరి దశదిన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అదేరోజు రాత్రి త్రిపురారం రామాలయంలో నిద్రచేసి ఇంటికి రాగానే స్పెషల్ పార్టీ పోలీసులు రంగశాయిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ప్రగతి భవన్‌కు మురుగు వాసన చేరే వరకు పోరాడాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్


మాట్లాడుతున్న మందుల సామేల్

మోత్కూరు : న్యాయమైన డిమాండ్ల సాధనకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు మురుగు వాసన చేరే వరకు గ్రామ పంచాయతీ కార్మికులు పోరాటం చేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థమాజీ చైర్మన్ మందుల సామేల్ పిలుపునిచ్చారు. బుధవారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. వారికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. ఇటు కార్మికులు అటు ఉద్యోగులుగా కాకుండా పంచాయతీ సిబ్బంది అయోమయంలో పడ్డారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,690, పంచాయతీల పరిధిలో సుమారు 60వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోక పోవడం వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేయడం ప్రభుత్వానికి సిగ్గు చేటన్నారు. వీఆర్ఏల మాదిరిగా పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి కారోబార్, బిల్ కలెక్టర్, పంచాయతీ సహాయ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలన్నారు. జీవో నెం.51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరారం భాస్కర్, మండల అధ్యక్షుడు సూరారం నాగయ్య, కార్మికులు మహేష్, బుచ్చయ్య, సుదర్శన్, మల్లేష్, యాదగిరి, ఎల్లమ్మ, శైలజ, లక్ష్మి, సోమయ్య, కృష్ణ, ధనుంజయ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్

ఆలేరురూరల్: కాంగ్రెస్ పార్టీని నిరోధించడం ఎవరి తరం కాదని, రానున్న ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ వచ్చాక అవినీతి, నిరుద్యోగం, అత్యాచారాలు, భూకబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళితులకు ముఖ్యమంత్రి పదవి, నిధులు, నియామకాలు అంటూ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, ఆయన ఇంట్లో మాత్రం నాలుగు ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ కృషితోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. రానున్న 90 రోజుల్లో కులమతాలకతీతంగా పని చేయాలన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీ అభివృద్ధికి ఏనాడు పని చేయలేదని, పార్టీ నిర్వీర్యం చేసేందుకే ప్రయత్నించాడని ఆరోపించారు. పార్టీ నిర్మాణం కోసం, కార్యకర్తలు నిజాయితీగా పనిచేయాలన్నారు. వెంకటేశ్వర్లు, ఎంపీ ఎజాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, జెడ్పీటీసీ నగేష్, ఎంపీపీ అశోక్, మధుసూదన్‌రెడ్డి, వీరారెడ్డి, నీలం పద్మ, వెంకటస్వామి, తుర్కపల్లి మండల అధ్యక్షురాలు జ్యోతిఅయోధ్యరెడ్డి, సంతోష్, బాలరాజు, నర్సింహులు, సత్యనారాయణ, లోకేష్, కిష్టయ్య, రాంరెడ్డి, మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన రేకుల ఇల్లు


హజారిగూడెంలో వర్షానికి కూలిన ఇల్లు

హాలియా : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనుముల మండలంలోని హజారిగూడెం గ్రామానికి చెందిన ఏర్పుల ధనలక్ష్మి రేకుల ఇల్లు కూలిపోయింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తమకు ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూడాలని బుధవారం మండల తహసీల్దార్ మంగకి వినతిపత్రం అందజేశారు. వర్షాలకు తమ గూడు కూలిపోయి రోడ్డున పడ్డామని, రోజువారీ కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్న తమ కుటుంబానికి నష్ట పరిహారం ఇప్పించి, గృహలక్ష్మి పథకంలో తమకు ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థికసాయం అందించి అండగా నిలవాలని వినతి పత్రంలో వేడుకున్నారు.

దెబ్బతిన్న ఎనిమిది ఇళ్లు

రాజాపేట: వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటి వరకు ఎనిమిది ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చల్లూరు 3, రఘునాథపురం2, పుట్టగూడెం 1, రాజాపేట 1, పారుపల్లిలో 1 మొత్తం 8 ఇండ్లు దెబ్బతిన్నట్లు తెలిపారు.

తుర్కపల్లి మండలంలో..

తుర్కపల్లి: ఆకాల వర్షానికి తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో బొత్త కృష్ణవేణి, మాధాపూర్‌లో ముద్దసాని మణెమ్మ, దేశికుంట లక్ష్మి, చిన్న లక్ష్మపూర్‌లో దుబాల హన్మంత్‌రెడ్డి ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు.

అదృశ్యమైన హెచ్‌ఎం ఆత్మహత్య

- అప్పుల బాధతోనే అఘాయిత్యం
- తుర్కపల్లి మండల పరిధిలో విషాదం


సుదర్శన్(ఫైల్)

బొమ్మలరామారం, తుర్కపల్లి : అదృశ్యమైన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యయుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తుర్కపల్లిలోని పలుగుల మైసమ్మ ఆలయ పరిసరాల్లో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, షామీర్‌పేట్ మండలం అలియాబాద్‌లో నివాసం ఉంటున్న దురసోజు సుదర్శన్(52) కొన్నేళ్లుగా బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గతంలో అలియాబాద్‌లో అప్పుచేసి 11గుంటల భూమిని కొనుగోలు చేశాడు. మరికొంత మందికి డబ్బులు అప్పుగా ఇచిన డబ్బులు తిరిగి రావడం లేదు. ఈ క్రమంలోనే ఈ నెల 25న సుదర్శన్‌కు తన భార్య శోభరాణితో డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. అనంతరం రోజువారీగానే పాఠశాలకు బైక్‌పై హాజరైన సుదర్శన్‌కు మధ్యాహ్నం ఆయన భార్య శోభరాణి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో ఆందోళనకు లోనైన ఆమె పాఠశాలకు చెందిన మరో టీచర్‌కు ఫోన్ చేసి సుదర్శన్ గురించి వివరాలు అడిగింది. సుదర్శన్ సార్ మన ఊరు–మన బడి కార్యక్రమానికి భువనగిరికి వెళ్లాడని సదరు టీచర్ శోభరాణికి ఫోన్‌లో తెలిపింది. సాయంత్రం అయిన సుదర్శన్ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇరుగు పొరుగు వారిని సంప్రదించినా ఫలితం లేదు.

ముఖానికి ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని..

వాసాలమర్రి, మల్కాపూర్ శివారులో హెల్మెంట్ ఉండడంతో పాటు పలుగుల మైసమ్మ ఆలయ పరిసరాల్లోని చెట్టుకింద విగతజీవుడిగా సుదర్శన్ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుదర్శన్ తలకు ప్లాస్టిక్ కవర్, టేపు చుట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పక్కనే మద్యంతో పాటు నీళ్ల బాటిళ్లు ఉన్నాయి. మృతుడికి డిగ్రీ చదువుతున్న కూతురు శ్రీజ, ఎంబీఏ చదువుతున్న కొడుకు అన్వేషిత్ ఉన్నారు. వీరి స్వస్థలం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి. తన భర్త మృతి అనుమానాస్పదంగా ఉందని, దీనిపై విచారణ జరపాలని భార్య శోభారాణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి చేయూత

- ఉపాధి హామీ ద్వారా సాగుకు ప్రభుత్వ నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం
- రాయితీపై పండ్ల మొక్కలు



పెద్దవూర, తిరుమలగిరి, గరిడేపల్లి: ఉద్యాన వన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు గాను రైతులకు రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం చేయూతనందిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో వీటి సాగు చేపట్టేందుకు నిర్ణయించింది. రాయితీపై పండ్ల మొక్కలను రైతులకు అందించనుంది. ఈ ఏడాది బిందు సేద్యం ద్వారా 13రకాల పండ్ల తోటలు, అంతర పంటల సాగుకు అవకాశం కల్పించింది. ఈ నెలాఖరు వరకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.

నాలుగేళ్ల వరకు ప్రభుత్వానిదే బాధ్యత

ఉపాధి నిధులతో చేపట్టే పండ్ల తోటల సంరక్షణ నాలుగేళ్ల వరకు ప్రభుత్వానిదే బాధ్యత ఉంటుంది. మామిడి మొక్కలు రూ.30, నిమ్మ రూ.25, నారింజ రూ.44, జీడీ మామిడి రూ.24, జామ రూ.31, సీతాఫలం రూ. 26, సపోట రూ.37, ఆయిల్‌పాం రూ.20, నేరేడు రూ.25, ఆపిల్ బేర్ రూ.51, దానిమ్మ రూ.24, మునగ రూ.15, డ్రాగన్ ఫ్రూట్ రూ.40, కొబ్బరి రూ.36 చొప్పున కొనుగోలుకు చెల్లించనుంది. గుంతలు తవ్వించడం, పండ్ల మొక్కలు నాటించడం తదితర పనులను ఉపాధి కూలీల ద్వారా చేపడుతారు. మొక్కలు నాటి ఊతం ఇచ్చినందుకు ఎరువులు వేసేందుకు గాను ప్రతి మొక్కకు రూ.50, నిర్వహణ కింద రూ.10 చొప్పున రాయితీని అందించనుంది. మొక్కలు నాటిన ఏడాది నుంచి నాలుగేళ్ల పాటు నిర్వహణకు రాయితీలు, ప్రోత్సాహకాలను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయనుంది.

అంతర పంటలకు సైతం..

పండ్ల మొక్కలతో పాటు అంతర పంటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. బీరకాయ, సొరకాయ, కాకరకాయ, చిక్కుడు, టమాట, పచ్చిమిర్చి, బోడ కాకర, గోరు చిక్కుడు, దోస, మునగ సాగుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తుంది. వివిధ రకాల పూల సాగుకు రైతులు ముందుకు వస్తే రాయితీలు పొందవచ్చు.

రాయితీపై బిందుసేద్యం పరికరాలు

పండ్ల తోటల పెంపకానికి ఈ ఏడాది బిందుసేద్యం పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుంది. ఉపాధి జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు 100శాతం రాయితీ, మిగితా రైతులకు 90శాతం రాయితీపై అందిస్తుంది. ఈ పండ్ల మొక్కతో పాటు ఇతర మొక్కలను ఏవైనా సాగు చేసుకోవచ్చు. ప్రభుత్వం కల్పించిన రాయితీ ధరకు మించి ఉంటే మిగతా డబ్బులను సంబంధిత రైతులు చెల్లించి తీసుకునే అవకాశం కల్పించింది.

నెలాఖరు వరకు దరఖాస్తు గడువు

పండ్ల తోటల సాగుకు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి, అనువైన భూమి, నీటి సౌకర్యం కలిగి ఉండాలి. పంట్ల తోటల పెంపకానికి ఎస్సీ, ఎస్టీలతో పాటు, ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు అర్హులు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత జీపీల కార్యదర్శి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, ఏపీవో, ఏఈఓ, ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారి, ఏఈ, సహాయ వ్యవసాయ సంచాలకుడు, ఎంపీడీఓ, ఎంపీఓలను సంప్రదించి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకానికి అవసరమైన పెట్టుబడి ప్రభుత్వం సమకూరుస్తుంది. 13 రకాల పండ్ల మొక్కల పెంపకానికి అవకాశం ఉంది. ఈ నెలఖరుకు నాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆగస్టు చివరి వారంలోగా డ్రిప్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి ఉపాధి పథకం ద్వారా గుంతలు తవ్వి మొక్కలు నాటిస్తాం. ఈ పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–మురళి, ఉద్యానవన శాఖ అధికారి, అనుముల క్లస్టర్